క్లుప్తంగా

ఆర్టీఓ కార్యాలయం మార్పు



కొత్త భవనంలోకి మార్చిన ఆర్టీఓ కార్యాలయం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి ఎదురుగా ఉన్న భవనంలోకి మార్చినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిరాదీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ టెస్ట్, ఎల్‌ఎల్‌ఆర్ పరీక్ష కోసం వచ్చే వారు నూతన కార్యాలయానికి రావాలని కోరారు.

పరామర్శ

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చమర్రి గ్రామానికి చెందిన వడ్లనరసప్ప (80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అదే గ్రామంలో 5 రోజుల క్రితం మృతి అనాగర్యోంతో బాధపడుతూ చెందిన తెలుగు చిన్నబంగారప్ప(53), చెట్ల లక్ష్మిరెడ్డి(70) ఇళ్లకు వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మూడు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రోగప్ప, బొజ్జప్ప, వెంకోబా,రవిరెడ్డి, శ్రీనివాసులు,లక్ష్మప్ప, మేకల నారయణ, కోసిగి నారయణ ఉన్నారు.

రజకులకు అండగా ఉంటాం



భూమి పూజ చేస్తున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని అర్బన్ : రజకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాంజల సమీపంలో రజకుల కోసం ధోబి ఘాట్, ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ రెండేళ్లక్రితం కౌన్సిలర్ ఎన్నికల ప్రచారంలో రజకులకు ఇచ్చిన హామీ మేరకు నిర్మాణాలకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్యే నిధులు రూ.15 లక్షలు, ఎంపీ నిధులు రూ.25 లక్షలు విడులయ్యాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్‌లు లక్ష్మి, మహ్మద్‌స్వామి పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా

మంత్రాలయం రూరల్: మండలంలోని మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న 5 వాహనాలకు రూ.80 వేల వరకు జరిమానా విధించినట్లు ఆదోని ఎంవీఐ శిశిరదీప్తి తెలిపారు. వాహనదారులు రికార్డులను వెంట ఉంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

నూతన ల్యాబ్ ప్రారంభం



వై.సీతారామిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదోని రూరల్ : ఆదోని–ఆలూరు రోడ్డులోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో డేటా అనలిస్ట్స్ నూతన ల్యాబ్‌ను ఎమ్మిగనూరు ఆర్టీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అధునాతన పరికరాలతో ల్యాబ్ నిర్మించడం అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రెటరీ పి.ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో ఆదోని ఎంవీఐ శిశిరదీప్తి, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన వారు డ్రైవింగ్ లైసెన్స్ కోసం నేరుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు.ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

పెద్దకడబూరు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కంబలదిన్నె గ్రామ క్రాస్ దగ్గర సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని 20 వాహనాలకు రూ. 4వేలు అపరాధ రుసుము వసూలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనదారులు రికార్డులను వద్ద ఉంచుకోవాలని చెప్పారు. తమ వాహనాలకు చలానా పెండింగ్‌లో ఉంటే వెంటనే చెల్లించాలని కోరారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

ఆదోని రూరల్: స్పందనలో వచ్చిన సమస్యలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేయరాదని అధికారులను సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ డివిజన్‌లోని అధికారులందరూ స్పందన కార్యక్రమంలో తప్పకుండా పాల్గొని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. సాధ్యమైనంత వరకు సోమవారం స్పందనలో వచ్చిన అర్జీలను శనివారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి రాకూడదన్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎన్ని పరిష్కరించారు. ఇంకా ఎన్ని పరిష్కరించాలి వంటి వివరాలను శనవారం సాయంత్రంలోపు నివేదిక ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. స్పదన అర్జీలకు సంబంధించి ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

స్పందనలో ప్రజల నుంచి అందిన సమస్యల్లో కొన్ని..

- సర్వే నంబర్ 149లో 1.19 ఎకరాలు ఆన్‌లైన్ పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కౌతాళం మండలకేంద్రానికి చెందిన నరసింహులు అర్జీ సమర్పించారు.
- ఆదోని పట్టణం స్టేట్‌బ్యాంకు కాలనీకి చెందిన ఖయ్యూం సర్వే నంబర్ 613,ఏ2, ఏ3, ఏ4లో 8.50 ఎకరాల పెద్దతుంబలం గ్రామం వద్ద సాగు చేస్తున్నామని, ప్రస్తుతం రెండు ఎకరాల పొలం ఆక్రమణకు గురైందదని, సమస్యను పరిష్కరించాలని కోరారు.
- నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన వసంత సర్వే నంబర్ 545/ఏలో 2.35 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని, దీనిపై విచారణ చేపట్టి ఆర్‌ఓఆర్ చట్టం మేరకు పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

- ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన భీమలింగ సర్వే నంబర్ 79లో 1.85 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం ఆన్‌లైన్ అడంగల్‌లో 1.70 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన 15 సెంట్ల భూమిని నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరామమోహన్, ఆర్టీఓ శివారెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఎస్‌డబ్ల్యూఓ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

ఆదోని అర్బన్ : స్థానిక హనుమాన్‌నగర్‌లోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ బాబురాజు టీబీపై సోమవారం అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే దగ్గరలోని ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఆకలి, బరువు తగ్గడం, ఉదయం, సాయంకాలం జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. నివారణ చర్యలకు పుట్టిన బిడ్డకు బీసీజీ వేయించాలన్నారు. హెచ్ఎం లక్ష్మికాంత్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆదోని రూరల్ : టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించి, గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు తిప్పన్న, నాగరాజు, శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహాలను సందర్శించాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- కర్నూలుకు తరలింపు



తీవ్ర గాపడిన హాజీ ,



ఇర్ఫాన్

ఆదోని అర్బన్: పట్టణ, పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాలయాలయ్యాయి. పట్టణశివారు బైపాస్ రోడ్డు సమీపంలో కారు–ఆటో ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపెండేకల్ గ్రామానికి చెందిన హాజీ, ఇర్ఫాన్, రజాక్ ఆదోనిలో కిరాణా సంత చేసుకుని ఆటోలో గ్రామానికి రాత్రి బయలుదేరారు. పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డులోని బైపాస్ రోడ్డు సమీపంలో ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వస్తున్న కారు,ఆటో ఢీకొనడంతో ఆటోలో ఉన్న హాజీ, ఇర్ఫాన్, రజాక్‌కు గాయాలయ్యాయి. ఇందులో హాజీకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మెరుగైన వైద్యం కోసం హాజీని కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే ఆదోని ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో క్షతగాత్రులకు గంట పాటు చికిత్స అందలేదు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

నల్లగేటు సమీపంలో ప్రమాదం..

అలాగే పట్టణంలోని నల్లగేటు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో కపటి గ్రామానికి చెందిన వినోద్, ఆదోని పట్టణానికి చెందిన మాణిక్యంకు గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వినోద్‌ను కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

కోసిగి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ రుద్రగౌడ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు సుధావతి, సురేఖలు పిలుపునిచ్చారు. సోమ వారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయ డం మంచి కాదని, మాతశిశు మరణాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. నిబంధనల ప్రకారం ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లవాడికి 21 ఏళ్లు వయసు పై బడిన వారికి మాత్రమే వివాహాలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారికి జైలుశిక్షతో పాటు జరిమానా తప్పదని హెచ్చరించారు. ఏపీఎం సత్యమ్మ, వివిధ మతాల కుల పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి

ఆదోని అర్బన్ : పట్టణంలోని వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మధుసూదన్శర్మ, 18వ వార్డు కౌన్సిలర్ చిన్నా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం అందజేసిన యూనిఫాంను ధరించకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు యూనిఫాంలో విధులకు హాజరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ బోయి శాంతకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రైతులకు పరిహారం చెల్లించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

ఆదోని రూరల్ : పట్టణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం బాధిత రైతులతో రైతుసంఘం, సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడుతూ పేదల ఇళ్ల కోసం పంటలు పండుతున్న భూములను ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

స్పందిస్తే ఆపద్బాంధవుడే!

- క్షతగాత్రులను కాపాడటంలో చొరవ చూపాలి
- బాధితుడిని ఆసుపత్రికి నిరభ్యంతరంగా తీసుకెళ్లొచ్చు
- ఎవ్వరూ ఎలాంటి ప్రశ్నలు అడగరు
- రోడ్డు ప్రమాదాల మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త చట్టం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవాణా శాఖ ఉప కమీషనర్ కె. శ్రీధర్(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): ఇకపై ఎవరైనా రోడ్డు ప్రమాదాల్లో గాయపడితే ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సంకోచించాల్సిన పనిలేదు. ఇదివరకులాగా వారిని ఆసుపత్రిలో గానీ, పోలీసులు గానీ ఎవ్వరూ ఎలాంటి ప్రశ్నలు, వివరాలు అడగరు. ఈ మేరకు భారత ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసింది. రహదారి ప్రమాదాల్లో గాయపడ్డ వారి మరణాలను తగ్గించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమారిటియన్' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు చాలా కీలకం. అయితే, వివిధ కారణాలతో కొందరు ఎవరైనా రోడ్డు ప్రమాదానికి గురైతే వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు సంకోచిస్తున్నారు. దయతలిచి క్షతగాత్రులకు సహాయం చేస్తే మెడికో లీగల్ కేసులో భాగంగా పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది ఇబ్బంది పెడతారని మరికొందరి భయం. దీంతో విలువైన ప్రాణాలు తక్షణ వైద్యసహాయం అందక గాలిలో కలిసిపోతున్నాయని ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ మరణాలను తగ్గించేందుకు గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించేందుకు సహాయపడిన వ్యక్తులకు రక్షణ కోసం కేంద్రం నూతన చట్టం తీసుకొచ్చినట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ కె. శ్రీధర్ చెప్పారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని హాస్పిటల్ సిబ్బంది వేధించకూడదని, బాధితుని అడ్మిట్ చేసుకోవాలి గానీ, సహాయకుని గుర్తింపు గానీ, చిరునామా గానీ అడిగి వేధించకూడదని వైద్యులకు చెప్పినట్లు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో కూడా కేసు విషయంలో సహాయకారిని ఏ విధమైన ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగకూడదని, వారి సాక్ష్యం కోసం బలవంతం చేయకూడదన్నారు. తప్పని పరిస్థితుల్లో సాక్ష్యం కోసం స్వయంగా ముందుకు వచ్చిన సహాయకారిని సంబంధిత కోర్టు విచారణ ఒక రోజులోనే ముగించాలని, రెండోసారి పిలవకూడదని పేర్కొనట్లు తెలిపారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం





ప్రత్యేక అలంకరణలో వాసవీమాత , సామూహిక కుంకుమార్చన ఆచరిస్తున్న మహిళలు

ఆదోని అర్బన్ : పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు ఆర్యవైశ్య మహిళలు, పురుషులు వాసవీమాత మాలను ధరించి దీక్ష చేపట్టిన మాలధారులు దీక్ష విరమించారు. ముందుగా వాసవీమాతకు పంచామృతాభిషేకం, హోమం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మాలధారులు ఇరుముడి కట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి అమ్మవారికి ఇరుముడి సమర్పించారు. సంఘం సభ్యులు వి.టి.ప్రకాష్, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, టి.జి. రాంప్రసాద్ పాల్గొన్నారు.



ఇరుముడితో వాసవీమాత మాలధారులు



పూజలందుకున్న నల్లారెడ్డి స్వామి

ఘనంగా ఆరాధన

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పార్వతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి నారాయణస్వామి ఆలయాల్లో గణపతి పూజ, ప్రాతఃకాలపూజ, నవగ్రహ వాస్తు, మృత్యుంజయ హోమం, కూస్మాండ బలి ప్రదానము, అభిషేకాలు, గణపతి హోమం, మహా మంగళహారతులు, రుద్రహోమం, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆస్పరి, తురువగల్లు, తొగలుగల్లు, దొడగొండ, యాటకల్లు, బైలుపత్తికొండ, గార్లపెంట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాములను దర్శించుకుని కానుకలు సమర్పించారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా నేతాజీ జయంతి

ఆదోని అర్బన్ : పట్టణంలోని అక్షయ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి సొసైటీ నాయకులు పూలమాలలు నివాళులర్పించారు. సొసైటీ వ్యవస్థాపకుడు నాగరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర సమరంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ త్యాగాలు, పోరాటాలను స్మరించుకున్నారు. 40 వేలకు పైగా సైన్యాన్ని ఏర్పాటు చేసి దేశ స్వాతంత్య్ర పోరాటానికి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టిన పోరాట వీరుడని కొనియాడారు. మహేష్, మంగలి రాము, శివ, వీరేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.



నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అశ్వవాహనంపై శ్రీవారు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామి అశ్వవాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు దీప జ్యోతులు ప్రదర్శించారు. అంతకు ముందు స్వామికి పంచామృతాభిషేకం, రుద్ర పాశుపత హోమం నిర్వహించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైనస్‌కు ఎండోస్కోపితో మెరుగైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): ముక్కు సమీపంలో ఉండే గాలి గదుల్లో ఏర్పడే సైనస్ సమస్యలకు ఎండోస్కోపిక్ పరికరంతో మెరుగైన చికిత్స అందించవచ్చని ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఎస్‌ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నూతన వైద్యులకు సైనస్ సమస్యలకు ఎండోస్కోపి ద్వారా ఎలా చికిత్స చేయాలనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బి. జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎండోస్కోపి పద్ధతి ద్వారా ముఖంపై ఎలాంటి కోత లేకుండా ముక్కులోకి పరికరాన్ని పంపించి సమస్యను నివృత్తి చేస్తామన్నారు. ముక్కు సున్నితభాగం కాబట్టి అత్యంత క్లిష్టమైన ఈ వైద్యచికిత్సపై నూతన వైద్యులకు నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగింపుపై హర్షం

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్లపాటు ప్రభుత్వం పొడిగించడంపై కేవీపీఎస్ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం–2013 నియమ, నిబంధనలు చాప్టర్–4 ద్వారా జనవరి 23వ తేదీ కాలపరిమితి ముగుస్తున్న నేపథ్యంలో పదేళ్లకు పొగిడించడం హర్షణీయమన్నారు. గత పది సంవత్సరాల కాలంలో 54.5 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ. 15 వేల కోట్లను కేటాయించారన్నారు. అయితే, సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ, విజయమ్మ, రాజు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి దీవించండి

- ఆస్పరిలో గడప గడప మన ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆస్పరిలో పర్యటించారు. ముందుగా సోమప్ప ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. కాసేపు సచివాలయంలో సిబ్బందితో సమావేశమై ప్రజలకు అందుతున్న సేవలు గురించి చర్చించారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్రతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో చేపట్టిన కుళాయిలను ప్రారంభించారు. సమీపంలో చాకలి లక్ష్మి బంక్‌లో దుస్తులను ఇస్త్రీ చేస్తుండగా ఆప్యాయంగా పలకరించారు. స్త్రీ పట్టుకుని దుస్తులను ఇస్త్రీ చేశారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, మండల సొసైగా చైర్మన్ గోవర్ధన, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సీతఈఓ అశోక్, ఈఓ రామాంజనేయులు,ఎంపీటీసీ సభ్యురాలు మహాలక్ష్మి, లింగ మ్మ,ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆస్పరిలో కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి

నేడు చిప్పగిరి మండలంలో..

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలన్నారు.